శుక్రవారం, నవంబర్ 28, 2025
TGTEL/25/A3750 ... నిజమే ...
నిజాయితి
https://nijamenijayathi.com తెలుగు దిన పత్రిక



# కొల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన

**- కెనరా బ్యాంకు ను ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకుడు జూపల్లి అరుణ్**



**కొల్లాపూర్, నవంబర్ 27 (నిజాయితి) :**
కెనరా బ్యాంక్ వారి ఆహ్వానం మేరకు నేడు కొల్లాపూర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన కెనరా బ్యాంకు ను జూపల్లి అరుణ్ గారి చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా జూపల్లి అరుణ్ గారు మాట్లాడుతూ కెనరా బ్యాంకు ద్వారా కొల్లాపూర్ నియోజక వర్గ పరిధిలో గల రైతులకు వ్యాపారులకు మరియు ప్రజలకు కెనరా బ్యాంక్ సేవలు అందుబాటులో ఉండే విధంగా చేస్తూ కెనరా బ్యాంకు ద్వారా రైతులకు వ్యాపార సంస్థలకు చిరువ్యాపారులకు రుణాలు అందించే విధంగా కృషి చేయాలి అని కెనరా బ్యాంక్ సిబ్బందికి తెలియజేసినారు. కెనరా బ్యాంక్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న జూపల్లి అరుణ్ గారికి శాలువాతో సన్మానించిన కెనరా బ్యాంక్ సిబ్బంది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకుడు జూపల్లి అరుణ్ గారితో పాటుగా యన్మనుబెట్ల మాజీ సర్పంచ్ మేకల నాగరాజు కొల్లాపూర్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్లు షేక్ రహీం పాష మేకల శిరీష మరియు కెనరా బ్యాంక్ ఏజీఎం వెంకటేశ్వర్ రెడ్డి మేనేజర్ రవీందర్ రెడ్డి మరియు కొల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 151 గ్రామ పంచాయతీల పరిధిలోని సర్పంచ్ అభ్యర్థుల నుండి

**- మొదటి రోజు నమోదైన నామినేషన్లు 121**




**నాగర్‌కర్నూల్, నవంబర్ 27 (నిజాయితి) :** స్థానిక ఎన్నికల షెడ్యూల్ ప్రకారం నాగర్‌కర్నూల్ జిల్లాలో నామినేషన్ గట్టం ఆరంభమైన 151 గ్రామ పంచాయతీల పరిధిలో మొదటి రోజు 121 నామినేషన్‌లు సర్పంచ్ అభ్యర్థుల నుండి వచ్చాయని, 26 నామినేషన్‌లు వార్డు సభ్యుల అభ్యర్థుల నుండి వచ్చాయని జిల్లా ఎన్నికల అధికారి వెల్లడించారు.

# సర్పంచ్ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీలోకి భారీ చేరికలు



**తెల్కపల్లి, నవంబర్ 27 (నిజాయితి) :** ఈరోజు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నాగర్ కర్నూల్ నందు ఎమ్మెల్యే డా. కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి గారల సమక్షంలో తెలకపల్లి మండలం గోలగుండం గ్రామం పార్టీ సీనియర్ నాయకులు కేసాని నరేందర్ రావు, సురేందర్ రావు, మాధవరం సంతోష్ రావు మరియు వారి అనుచరులు బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీ లోకి చేరడం జరిగింది. వారికి ఎమ్మెల్యే మరియు ఎమ్మెల్సీ గారలు పార్టీ కండువాలు కప్పి పార్టీల లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొనడం జరిగింది.

# మావోయిజం ఒక రాజ్యాంగేతర శక్తి

ఇంద్రపాల శ్రీనివాస్ (మాడ్వీ హిడ్మా స్మృతిలో వ్యాసం)



మావోయిస్టులు అప్రజాస్వామికులే అనుకందాము. కానీ ఒక రాజ్యాంగం, ప్రజలు, చట్టబద్ధ వ్యవస్థ, ప్రజాస్వామ్యం చేయాల్సిన పనులు కొన్ని వాళ్ళు చేసి చూపారు. అడవుల్లో ఉంటూ దశాబ్దాలుగా అడవులను కంటికి రెప్పలా కాపాడుకుంటూ అడవులను కార్పొరేట్ శక్తుల పరం కాకుండా అడవులను గుండెలకు హత్తుకున్నారు. ఆదివాసుల హక్కులకు తమ ప్రాణాలను అడ్డుపెట్టారు, సహజ వనరుల విధ్వంసానికి అడుగడుగునా అడ్డు తలిగారు. దేశం లోపల ముఖ్యంగా అడవి లోపల ప్రజల మాన ప్రాణాలకు రక్షణగా తామున్నామని బాసటగా నిలిచారు. అణిచివేతలకు, అన్యాయాలకు, అక్రమాలకు, ఎదురొడ్డి పోరాడారు. దశాబ్దాలుగా ఏకైక ధిక్కారస్వరంగా దేశం నలుదిక్కులా వినిపించారు. ఈ విప్లవ పంథా ప్రజల జీవన వికాసానికి ఒక అడుగు దూరంలో నిలిచిపోయింది. కాకపోతే ప్రజల హృదయాలను కొన్ని ఏళ్ల పాటు ఏకధాటిగా ఏలారు. అసలైన ప్రజాపాలన అడవి ప్రజలకు రుచి చూపారు. ఇటు పోలీసులు, ప్రభుత్వ బలగాలు రాజ్యాంగాన్ని పరిరక్షించేవాళ్లు పైగా చట్టబద్ధంగా ఎంపిక ఐనవాళ్లు. వీళ్ళు చేసే పనులన్నీ చట్టబద్ధమా!? వీళ్ళు పౌరులకు రక్షణ కల్పిస్తున్నారా, పాలక వ్యవస్థలకు తొత్తులుగా పనిచేస్తున్నారా!!? నిజానికి మన దేశ రక్షణ వ్యవస్థ అంతర్గత దేశద్రోహులను పెంచి పోషిస్తుంది వారికి కాపలాగా ఉంటుంది. ఒక అవినీతిపరుడికి, ఒక అక్రమార్గుడికి, ఒక భూకబ్జాదారుడికి, ఒక బ్యాంకు రుణం ఎగవేత దారుడికి వొంత పాడి, ఒక బడా రాజకీయ నాయకుడికి అండగా నిలిచి, వారి చెప్పు చేతుల్లో బతికే మన ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రజలకు ఏం చేస్తున్నది, ఎలాంటి సందేశం ఇస్తున్నది అన్నది అసలైన ప్రశ్న? ఈ ప్రశ్నకు కొన్ని సమాధానాలు మావోయిస్టుల రూపంలో ప్రజలకు కనపడాయి, వినపడ్డాయి. అందుకే రాజ్యాంగేతర శక్తులైన మావోయిస్టులు అంటే ప్రజలకు అభిమానం. ఇప్పుడు ఎక్కడ ఏ నోట విన్న హిడ్మా పేరు మార్మోగుతుంది. వాస్తవానికి హిడ్మా చేసింది రవ్వంత. రవ్వంత కూడా కొండంతగా మనకు ఎందుకు కనిపిస్తుంది అంటే ఇప్పుడున్న పరిస్థితుల్లో కనీసం ఆ రవ్వంత చేసే వాళ్ళు కూడా లేరు. కొందరు హిడ్మా పెద్ద గా చదువుకోలేదు అని విమర్శిస్తున్నారు అయితే ఉన్నత విద్య అభ్యసించకపోయినా ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని ఉన్నత విలువలతో ఉన్నత వ్యక్తిత్వంతో తనను నమ్ముకున్న తన అడవి కోసం, అడవి ప్రజల కోసం ఆఖరి శ్వాస వరకు పోరాడాడు, ఇప్పుడు హిడ్మానే ఒక చరిత్ర అయిపోయాడు. బాగా చదువుకున్న మనం సమాజం నడి మధ్యలో బతుకుతూ ఏ మాత్రం ప్రజా సమస్యల మీద పోరాడు తున్నామో ఒకసారి ఆత్మ విమర్శ చేసుకోవాలి. హిడ్మా పెద్దగా చదువుకోకపోయినా హిడ్మా గురించే ఇప్పుడు మనం చదువుకుంటున్నాం. భావితరాలు చదువుకోబోతున్నాయి. ఎందుకంటే అతనిది ఒక వీరోచిత పోరాటం. హిడ్మా ను వీరుడు అనడం కూడా తక్కువే ఎందుకంటే అడవి జనం అతన్ని దేవుడు అంటున్నారు. ఒక సిద్ధాంతాన్ని నమ్ముకుని ఆయుధాలు పట్టుకుని అడవుల్లో ఉంటూ దోపిడీకి వ్యతిరేకంగా మావోయిస్టులు చేసిన మంచి పనులే కాకుండా కొన్ని దుర్మార్గాలు కూడా లేకపోలేవు. వాళ్ల శత్రువు పోలీసు వ్యవస్థనే అయిపోయింది తప్ప ఈ దోపిడీ వ్యవస్థ మన శత్రువు అనే మార్గం నుండి కొంచెం మావోయిస్టులు దారి తప్పారు. చివరి వరకు అదే పరంపరను కొనసాగించారు. ఇక్కడ మావోయిస్టులు క్షమార్హులు కాదు. మావోయిస్టులు అవినీతిపరులైన నాయకులను చంపినప్పుడు సాధారణ ప్రజలు కూడా హర్షించారు. కానీ పోలీసులను పొట్టన పెట్టుకున్నప్పుడు ప్రజల నుండి కూడా వ్యతిరేకత మొదలైంది. మరో పక్క ఈ ప్రజాస్వామ్య వ్యవస్థ ఆదివాసుల, అడవి బిడ్డల హక్కులకు భంగం వాటిల్లకుండా వాళ్ల బతుకులకు భరోసా కల్పిస్తే, అడవిని ఆక్రమణదారుల నుండి రక్షిస్తే, అందుకు అండగా నిలబడితే, వాళ్లు సైతం మావోయిజానికి, మావోయిస్టులకు వ్యతిరేకంగా ఉద్యమించే అవకాశాలు ఉన్నాయి. ఆ అపనమ్మకం వల్లే ఆ భరోసా లేకపోవడం కారణంగానే ఆదివాసీలు, అడవి బిడ్డలు, సామాన్య ప్రజానీకం మావోయిజానికి ఇన్నాళ్లుగా మద్దతు పలికారు. మరోవైపు కొన్ని దశాబ్దాల పాటు పోలీసులను, ప్రభుత్వ బలగాలను, ప్రభుత్వ వ్యవస్థను ముప్పు తిప్పల పెట్టి ఒక్కసారి కూడా చిక్కకుండా ఏమర పాటుగా ఉండకుండా మెరుపు వేగంతో దాడులకు పాల్పడి ఎక్కడ ఎవరు చేయలేని డ్యామేజ్ చేసి మావోయిస్టుల్లోనే ఒక ఎత్తయిన శత్రుదుర్భేద్యమైన శక్తిగా నిలిచిన హిడ్మా పోలీసులకు ఏ రకంగా చిక్కినా వాళ్లు వదిలే ప్రసక్తి అయితే ఉండదు. అందరి లాగా లొంగిపోతా అంటే కరచాలనం చేసి ప్రెస్ మీట్ పెట్టి హిడ్మా ను జనజీవన స్రవంతిలోకి కలిపే అవకాశం, అవసరం అంతకన్నా ఉండదు. ఎందుకంటే హిడ్మా సాదా సీదా మావోయిస్టు కాదు కదా. వ్యవస్థకు, పోలీసులకు హిడ్మా ఒక జీవితకాల శత్రువు. ఒకప్పుడు వాళ్లకు మృత్యువు ఉందంటే కేవలం హిడ్మా రూపంలోనే కావొచ్చు. అలాంటి హిడ్మా ను దొరికితే వాళ్లు వదిలే ప్రసక్తే లేదు. కానీ హిడ్మా కూడా లొంగి పోయే వ్యక్తిత్వం కాదని అతని పోరాట జీవితం చెప్పకనే చెబుతుంది. ఎవరో మాయమాటలు చెప్తే విధి లేక విని, నమ్మక ద్రోహులను గుడ్డి గా నమ్మి ఫలితంగా హిడ్మా తన ప్రాణాలను కోల్పోయాడు. అంతేకాదు ఆదివాసుల ఆత్మ గౌరవం, హక్కులు, అతని భౌతిక కాయం తో పాటే బూడిదలో కలిసి, అడవి గొంతుక అతనితో పాటే మూగ పోయింది. ఇక అడవులు అంతరించిపోవడానికి మొదటి అడుగు హిడ్మా మరణం తో గట్టిగానే పడింది. హిడ్మా నిజం గా ఇది నీ మరణం కాదు సరి కొత్త జననం "హిడ్మా" ను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలి కానీ తుపాకీ పట్టి కాదు పిడికిలి బిగించి, హిడ్మా రూపం లో అడవుల్లో కాదు నగరం నడి బొడ్డున ఇప్పుడు ఉద్యమం ఉద్భవించాలి.



# కంటి శిబిరంలో 23 మందికి కంటి క్యాటరెక్ట్ ఆపరేషను

**- 74 మందికి సాధారణ మరియు కంటి పరీక్షలు**

**నాగర్‌కర్నూల్, నవంబర్ 27 (నిజాయితి) :**
జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా అందత్వ నియంత్రణ సంస్థ వారి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నాడు నాగర్‌కర్నూల్ పట్టణంలోని పాత కలెక్టరేట్ భవనం 102 గదిలో నిర్వహించిన కంటి చికిత్స శిబిరం విజయవంతమైనట్లు నాగర్‌కర్నూల్ అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చింతపట్ల నీరజ్ కుమార్ తెలిపారు. 50 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా కంటి పరీక్షలు తరచుగా చేసుకోవాలని ఆయన సూచించారు. కంటి ఆరోగ్యం కాపాడుటలో ప్రతి ఒక్కరూ విటమిన్ ఏ కలిగిన పోషక ఆహారాన్ని అధిక మొత్తంలో తీసుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో జిల్లా లోని వివిధ ప్రాంతాల



నుండి వచ్చిన 74 మందికి కంటి పరీక్షలు ఆప్తాలమిక్ అధికారి కొత్ర బాలాజీ చేశారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటి శిబిరాలను జిల్లా ప్రజలు అధిక మొత్తంలో వినియోగించు కోవాలని ఆయన కోరారు. శిబిరంలో కంటి పరీక్షలు 74మందికి నిర్వహించగా, అందులో అర్హులైన క్యాటరాక్ట్ పొరగల 23మందిని గుర్తించి ప్రత్యేక అంబులెన్స్ వాహనంలో లయన్ రాంరెడ్డి కంటి ఆసుపత్రికి పంపినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నేత్రాధికారి కొత్ర బాలాజీ, వై.శ్రీనివాసులు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి, సుకుమార్ రెడ్డి, నరసింహ, చెన్నకేశవులు, ప్రకాష్ రోగులు తదితరులు పాల్గొన్నారు

# ప్రపంచ పర్యాటక కేంద్రంగా తెలంగాణ

**- జర్మనీ ప్రతినిధులతో మంత్రి జూపల్లి కృష్ణారావు**

**హైదరాబాద్, నవంబర్ 27 (నిజాయితి) :**
పర్యాటకుల, పెట్టుబడుల గమ్యస్థానంగా తెలంగాణను ఆవిష్కరిస్తామని, ఘనమైన తెలంగాణ చరిత్ర, సంస్కృతి, వారసత్వం కేంద్రంగా పర్యాటకాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు ప్రపంచస్థాయి మౌలిక వసతుల కల్పనతో ముందుకు వెళ్తున్నట్లు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం డా. బీఆర్. అంబేద్కర్ సచివాలయంలో జర్మన్ ఫ్రీడరిక్ ఎబర్ట్ స్టిఫ్టంగ్ ( ఫౌండేషన్ ప్రతినిధులు డా.సబీన్ ఫాంద్రిక్, మిర్కో గుంథర్ , క్రిస్టోఫ్ మోహ్రా మంత్రి జూపల్లి కృష్ణారావుతో సమావేశమయ్యారు. తెలంగాణ ప్రభుత్వ నూతన పర్యాటక విధానం, పర్యాటక రంగంలో పెట్టుబడులు, సుస్థిర



అభివృద్ధి భాగస్వామ్యం వంటి కీలక అంశాలపై ఈ సమావేశంలో లోతైన చర్చ జరిగింది. తెలంగాణ నూతన పర్యాటక విధానంలోని ముఖ్య లక్ష్యాలు, పెట్టుబడిదారులకు కల్పించే ప్రోత్సాహకాలు, విధానపరమైన సరళత గురించి మంత్రి వివరించారు. తెలంగాణ రాష్ట్రం పర్యాటక రంగంలో అపారమైన సామర్థ్యాన్ని కలిగి ఉంది. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను కల్పించడంలో జర్మన్ నైపుణ్యం, పెట్టుబడులు మాకు సహాయపడతాయి. మా నూతన పర్యాటక విధానం విదేశీ పెట్టుబడిదారులకు అత్యంత అనుకూలంగా ఉందని మంత్రి తెలిపారు. ద్వైపాక్షిక అంశాలతో పాటు, ప్రాంతీయ మరియు అంతర్జాతీయ పరిణామాలపై కూడా తమ అభిప్రాయాలను ఈ సందర్భంగా పంచుకున్నారు

# దేవుడిని ప్రార్థించే చోట అందరికీ అవకాశం

**- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**మహబూబ్ నగర్, నవంబర్ 27 (నిజాయితి) :**
జామియా మజీద్ మరియు వక్స్ -ఎ-రహెమానియా ఈద్గా నిర్వాహణ నూతన కమిటీ సభ్యులు గౌరవ మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డిని వారి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ జామియా మజీద్ అభివృద్ధికి మౌలిక వసతుల కల్పన కోసం రూ.1 కోటి 50 లక్షలు, అదే విధంగా ఈద్గా అభివృద్ధికి మరో రూ.1 కోటి 50 లక్షలు కేటాయించామని తెలిపారు. ప్రార్థనా స్థలాల అభివృద్ధి ద్వారా ఆధ్యాత్మిక వాతావరణం మరింత బలోపేతం అవుతుందని ఆయన పేర్కొన్నారు. దేవుడిని ప్రార్థించే చోట అందరికీ అవకాశం కల్పించాలనే ఉద్దేశం తో నూతన కమిటీలలో 90 శాతం కొత్తవారికి అవకాశం కల్పించామని, అందులో విద్యావంతులు,



అనుభవజ్ఞులు, భక్తి-శ్రద్ధలు కలిగిన వారిని ఎంపిక చేసి పూర్తిగా పారదర్శక విధానంలో కమిటీ ఏర్పాటు జరిగిందన్నారు. రెండు సంవత్సరాల పాటు కొనసాగనున్న ఈ కమిటీలు కేటాయించిన నిధులను సద్వినియోగం చేసి అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు ప్రజల్లో భక్తిని పెంపొందించడం, మహబూబ్ నగర్‌లో సోదరభావాన్ని మరింత బలపరచడం ఈ కమిటీల ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ మూడు అంశాలను దృష్టిలో పెట్టుకొని నూతన కమిటీలు విజయవంతంగా తమ బాధ్యతలు నిర్వర్తిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ , హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు సాదుల్లా, ఈద్గా కమిటీ అధ్యక్షులు రిటైర్డ్ డీఎస్పిఓ మహ్మద్ బషీరుద్దీన్, ఉపాధ్యక్షులు ఖాజా ఖియాముద్దీన్ , కార్యదర్శి అబ్దుల్ వహీద్ ఖాన్ దురాని, సంయుక్త కార్యదర్శి మహ్మద్ జుల్ఫికర్‌అలీ, కోశాధికారి ఖాదర్ మొహియోద్దీన్, సభ్యులు అబ్దుల్ మోసీన్, ఖాజా హస్నోద్దీన్, ఖాజపాష, మహ్మద్ తాజుద్దీన్, డాక్టర్ మీర్ ముజవిర్ అలీ, మహ్మద్ ఫరీద్ లు జామీయ మజీద్ కమిటీ అధ్యక్షులు సయ్యద్ అమీనుద్దీన్ ఖాద్రీ, ఉపాధ్యక్షులు ఫహీమ్ సిద్ధిఖీ, కార్యదర్శి ఎం.ఎ. మజీద్, కోశాధికారి మజీద్ ఖాన్, సభ్యులు సయ్యద్ మసూద్ మొహియుద్దీన్, మహ్మద్ ముక్తార్ అహ్మద్, సయ్యద్ అఫ్జల్, సమీముద్దీన్ ఖాన్, ఫజలుర్ రహమాన్, జహంగీర్ పాష ఖాద్రీ, మహ్మద్ ముస్తాక్ తదితరులు పాల్గొన్నారు.

